వైభవంగా భ్రమరాంబిక మల్లికార్జునస్వామి కల్యాణోత్సవం



వేం నరేందర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డిలను సన్మానించిన ఆలయ ధర్మకర్త పూజిత జగదీశ్వర్‌గౌడ్ దంపతులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నల్లగండ్లలోని శ్రీ భ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో జాతర ఉత్సవాలు ఆదివారం వైభవంగా జరిగాయి. ఆలయ ధర్మకర్త, శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వి.పూజిత జగదీశ్వర్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో చేపట్టిన ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజాకార్యక్రమాలు చేశారు. భ్రమరాంబిక మల్లికార్జున స్వామి కళ్యాణోత్సవం కనులపండువగా నిర్వహించారు. బోనాలు, పోతరాజుల విన్యాసాలు, కళాకారుల ఆటపాటలు ఆకట్టుకున్నాయి. ఈ వేడుకల్లో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ రంజిత్‌రెడ్డి, కూకట్‌పల్లి నియోజకవర్గ ఇంచార్జీ బండి రమేష్, ఎంబీసీ డెవలప్‌మెంట్ చైర్మన్ జెరిపాటి జైపాల్, రాష్ట్ర సోషల్ మీడియా చైర్మన్ మన్నె సతీష్ తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



మల్లికార్జున స్వామి ఆలయ వేడుకల్లో స్వామి వారి కళ్యాణంలో పూజిత జగదీశ్వర్‌గౌడ్ దంపతులు

పక్కా ప్రణాళికతో ఎన్నికలకు వెళ్లండి

- కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని సీఎం సూచన
- ఎంపీ అభ్యర్థి నీలం మధు

పటాన్‌చెరు టౌన్: తుక్కుగూడలో జరిగిన జన జాతర సభను విజయవంతం చేసిన స్ఫూర్తితో ప్రజలలోకి వెళ్లాలని, పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లి కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి నీలం మధు జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖతో కలసి సీఎం నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు.



నీలం మధుతో మాట్లాడుతున్న సీఎం రేవంత్ రెడ్డి చిత్రంలో మంత్రి కొండా సురేఖ

గెలిపించండి.. అండగా ఉంటా

జిన్నారం(పటాన్‌చెరు): ఎంపీ ఎన్నికల్లో తనను గెలిపిస్తే అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉండి సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని మెదక్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి నీలం మధు అన్నారు. జిన్నారంలో నిర్మాణంలో ఉన్న ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఆయనను కలిశారు. ఆలయ నిర్మాణంలో భాగస్వామి కావాలని ఆయనను కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శివాలయ నిర్మాణానికి తనవంతు సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. అనంతరం నీలం ఆయనను సంఘం సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఆనంద్‌చారి, రాజేందర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శ్రీధర్‌చారి, పుట్టి భాస్కర్, శ్రీనివాస్, కావలి శేఖర్, బండి మహేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీ ఉద్యోగుల రన్ ఫర్ హెల్త్



- మెగా 5కే రన్‌లో పాల్గొన్న 5 వేల మంది
- టీసీఎస్, యశోద హాస్పిటల్స్ ఆధ్వర్యంలో నిర్వహణ

మాదాపూర్: భారతీయ కార్పొరేట్ సాఫ్ట్‌వేర్ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, యశోద గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్‌తో కలసి ఆదివారం రన్ ఫర్ హెల్త్ పేరుతో మెగా 5కే రన్ నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా యశోద హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జి.ఎస్.రావు, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ ప్రెసిడెంట్ రాజన్నలు పాల్గొని 5కే రన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల్లో హెల్తీ లైఫ్‌స్టైల్ పట్ల అవగాహన కల్పించడం కోసం 5 వేల మందికి పైగా టీసీఎస్ ఉద్యోగులు వారి కుటుంబసభ్యులతో కలసి రన్ చేసినట్టు తెలిపారు. యశోద హాస్పిటల్ నుంచి హైటెక్ సిటీ ఐకియా మీదుగా మళ్లీ యశోద హాస్పిటల్‌కి చేరుకున్నారు. నా ఆరోగ్యం నాహక్కు అనే నినాదంతో వ్యాయామాన్ని మన దినచర్యలో భాగంగా చేసుకోవాలన్నారు. నడక మన శారీరక ఆరోగ్యాన్ని పెంచడంతోపాటు మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీసీఎస్ ఉద్యోగులు, డాక్టర్లు, పారామెడిక్స్ , సిబ్బంది పాల్గొన్నారు.



5కే రన్ ను ప్రారంభించిన జి.ఎస్.రావు, రాజన్న

కొమర వెంకటేశ్ సేవలు మరువలేనివి

మణికొండ: చిత్ర పరిశ్రమ కార్మికులు, హౌసింగ్ సొసైటీ సభ్యులకు మాజీ అధ్యక్షుడు కొమర వెంకటేశ్ చేసిన సేవలు మరువలేనివని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అన్నారు. కొమర వెంకటేశ్ మొదటి వర్ధంతిని ఆదివారం చిత్రపురి కాలనీలో నిర్వహించగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మణికొండలో చిత్రపురి హౌసింగ్ సొసైటీ గృహల నిర్మాణానికి వెంకటేశ్ కృషి చేశారన్నారు. కార్యక్రమంలో మణికొండ మున్సిపల్ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ కె. రామకృష్ణారెడ్డి, చిత్రపురి హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు అనిల్‌కుమార్, సభ్యులు కాదంబరి కిరణ్, రఘు, మాజీ ఎంపీపీ తలారి మల్లేశ్, వెంకటేశ్ సతీమణి విజయలక్ష్మి పాల్గొన్నారు.

నర్తించి.. అలరించి..!

శిల్పారామంలో ఆకట్టుకున్న ఒడిస్సీ, మోహినియట్టం ప్రదర్శనలు



మాదాపూర్: అక్కడ ఝుమ్మంది నాదం.. సై అంది పాదం.. అందెల సవ్వడి అలరించింది.. లయాత్మక నృత్యాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి.. ఈ అద్భుత కళాప్రదర్శనలకు మాదాపూర్‌లోని శిల్పారామం వేదిక అయింది. వారాంతపు కార్యక్రమాలలో భాగంగా ఆదివారం ఇక్కడ ఒడిస్సీ, మోహినియట్టం నృత్యప్రదర్శనలు నిర్వహించారు. నిర్మల్య డ్యాన్స్ స్కూల్ గురువు దేబ్రసి పట్నాయక్ శిష్యబృందంచే ఒడిస్సీ నృత్యప్రదర్శనలో బట్టునృత్య, పల్లవి, మోక్ష తదితర అంశాలను అన్సీ, శార్వరి, నందు, నేహ, అనూష, శాంభవి, టియా, రోహిణిలు ప్రదర్శించారు. డాక్టర్ మైథిలీ అనూప్ శిష్య బృందంచే మోహినియట్టం నాట్యవిన్యాసాలు కనువిందుగా ఉన్నాయి. ఇందులో శ్లోకాలు, నవరసాంజలి, జతిస్వరం, కీర్తనం, తిల్లాన అంశాలను వీణ, ఉన్నతి, సంగీత, పార్వతి, తనిష్క, ప్రీతి, అనఘా, జాహ్నవి, శ్రీహిత కళాత్మకంగా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పాత్రికేయురాలు లక్ష్మి రామకృష్ణ కళాకారులను అభినందించారు.



మాదాపూర్‌లోని శిల్పారామంలో అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

గీతం స్కాలర్ రాణికి పీహెచ్‌డీ



పటాన్‌చెరు: గీతం స్కూల్ ఆఫ్ సైన్స్‌లో గణితశాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థిని జపమాల రాణిని డాక్టరేట్ వరించింది. 'సాధారణీకరించిన కుంభాకారం ద్వారా విరామం- విలువ ప్రోగ్రామింగ్ సమస్యల అధ్యయనం'పై ఆమె సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. గణిత శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో ఈ విషయం వెల్లడించారు. రేఖ సిద్ధాంత వ్యాసం, సర్వోత్తమీకరణం సమస్య అనిశ్చితి డేటాను పరిష్కరించడానికి సాంకేతికతలను పరిచయం చేసిందని తెలిపారు. రాణిని అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీఎస్ రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ తదితరులు అభినందించారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం


కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్



బహుమతులు అందజేస్తున్న కాట శ్రీనివాస్

పటాన్ చెరు: క్రీడలతో మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వం ఏర్పడుతుందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఆదివారం అమీన్‌పూర్ మున్సిపాలిటీ సాయి అంబికా కాలనీలో కాంగ్రెస్ పార్టీ జెనరల్ సెక్రటరీ రమేశ్ ఆధ్వర్యంలో మార్చ్ 23న ప్రారంభమైన స్పోర్ట్స్ క్రికెట్ లీగ్ టోర్నమెంట్‌లో 12 జట్లు తలబడ్డాయి. అందులో ఆదివారం నిర్వహించిన ఫైనల్స్‌లో గెలుపొందిన జట్లకు ఆయన బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారంలో సింధూ భారతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు జగన్‌రెడ్డి చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సంగీతవాయిద్య కచేరి

మాదాపూర్: కళాకారులు వివిధ వాయిద్యాలతో నిర్వహించిన సంగీత కచేరి అందరినీ ఆకట్టుకుంది. మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో ఆదివారం గురు పరంపర ఫౌండేషన్ భారతం పేరిట 120 మంది కళాకారులతో వయోలిన్ సింఫని కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాకారులు ఒక్కసారిగా సంగీతాన్ని ఆలపించి సందర్శకులను మంత్రముగ్ధులను చేశారు. ఆరభి ది సెంటర్ ఫర్ పెర్ఫామింగ్ భారతదేశంలో 25 సంవత్సరాలుగా హైదరాబాద్‌లో భారతీయ శాస్త్రీయ సంగీత (కర్ణాటిక్) వాయిద్యాలను ప్రోత్సహిస్తోంది. కంపోజ్ చేసిన సంగీతంపై ఫ్లూట్, కీబోర్డు, సాక్సోఫోన్, వయోలిన్, గిటార్, సెల్లో, డబుల్‌బాస్, ట్రంపెట్, ఓబో, వీణ, సితార్ వంటి విభిన్న వాయిద్యాలపై పిల్లలకి శిక్షణ ఇచ్చి సంగీత కచేరిని ప్రదర్శించి ఆకట్టుకున్నారు.

తమ్మారెడ్డి కృష్ణమూర్తి-కృష్ణవేణిలకు నివాళులు



తమ్మారెడ్డి కృష్ణమూర్తి, కృష్ణవేణి దంపతుల చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

హఫీజ్‌పేట్: ప్రముఖ సినీనిర్మాత వామపక్ష ఉద్యమ శ్రేయోభిలాషి తమ్మారెడ్డి కృష్ణమూర్తి, కృష్ణవేణి దంపతుల మూడవ వర్ధంతిని పురస్కరించుకొని కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్‌లో వారి చిత్రపటాలకు ఆదివారం ఫౌండేషన్ సభ్యులు, సినీదర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజ, కోడళ్లు వాణి, పూర్ణిమ లెనిన్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రముఖ పాత్రికేయులు ఏబీకే ప్రసాద్ మాట్లాడుతూ కృష్ణమూర్తి-కృష్ణవేణి దంపతులు సీఆర్ ఫౌండేషన్ వృద్ధాశ్రమ స్థాపనలో ఎనలేని కృషి చేశారన్నారు. తుదిశ్వాస వరకు ఆశ్రమంలో ఉంటూ సీఆర్ ఫౌండేషన్ అభివృద్ధికి పాటు పడ్డారని గుర్తు చేసుకున్నారు. నివాళులు అర్పించినవారిలో సీఆర్ ఫౌండేషన్ కోశాధికారి చెన్నకేశవరావు, వృద్ధాశ్రమ సలహా మండలి సభ్యులు డాక్టర్ సరస్వతి, రాజేందర్‌రావు, వృద్ధాశ్రమం వాసులు ఉన్నారు.

మోదీ కోసం అందరం ఓటేద్దాం

అపోలో ఆస్పత్రి ఈడీ డాక్టర్ సంగీతారెడ్డి



మాట్లాడుతున్న సంగీతారెడ్డి

రాయదుర్గం: మనకోసం, ప్రధాని నరేంద్ర మోదీ కోసం, అభివృద్ధి కోసం అందరం ఓటేద్దామని అపోలో ఆస్పత్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సంగీతారెడ్డి అన్నారు. నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని మై హోమ్ విహంగ గేటెడ్ కమ్యూనిటీలో స్థానికులతో చేవెళ్ల బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తరపున ఆమె ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరవాసుల్లో ఓటు చైతన్యం మరింత పెరగాలని, ఓటు వేస్తేనే మనకు ప్రశ్నించగలిగే హక్కు ఉంటుందని అన్నారు. మే 13న పోలింగ్ కేంద్రాలకు అందరూ ఉత్సాహంగా వెళ్లి బీజేపీకి ఓటువేసి గెలిపించాలని కోరారు.

శభాష్.. డ్రైవర్ వెంకటేశ్

బస్సులో మరిచిపోయిన ల్యాప్‌టాప్ ప్రయాణికుడికి అందజేత



ప్రయాణికుడికి ల్యాప్‌టాప్‌ను అందజేస్తున్న డ్రైవర్ వెంకటేష్

మియాపూర్: ఆర్టీసీ బస్సులో ఓ ప్రయాణికుడు మర్చిపోయిన ల్యాప్‌టాప్‌ను తిరిగి అతడికి అందించి నిజాయితీని చాటుకున్నారు మియాపూర్ ఆర్టీసీ డిపో- 1 డ్రైవర్ వెంకటేశ్. సూపర్ లగ్జరీ బస్సు శనివారం మియాపూర్ నుంచి విజయవాడకు బయలుదేరింది. సతీష్ అనే ప్రయాణికుడు కోదాడలో హడావిడిగా బస్సు దిగుతూ అందులోనే తన ల్యాప్‌టాప్‌ను మర్చిపోయాడు. బస్సు విజయవాడకు వెళ్లాక డ్రైవర్ వెంకటేశ్ ల్యాప్‌టాప్‌ను గమనించి సతీష్‌కు సమాచారం అందించారు. బస్సు తిరిగి మియాపూర్ వచ్చే సమయంలో మార్గమధ్యంలోని కోదాడలో ఎదురుచూస్తున్న సతీష్‌కు ల్యాప్‌టాప్ అందజేశారు. ఈ విషయం తెలుసుకున్న డిపో మేనేజర్, అధికారులు డ్రైవర్ వెంకటేష్‌ను అభినందించారు.

కాసాని జ్ఞానేశ్వర్ గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న చేవెళ్ల లోకసభ బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్లాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఆదివారం చేవెళ్ల లోకసభ బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌తో కలిసి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ... ఏప్రిల్ 13న చేవెళ్లలో జరిగే కేసీఆర్ భారీ బహిరంగ సభను సమష్టి కృషితో విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు ముక్తకంఠంతో బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని ప్రకటించారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన అభివృద్ధిని వివరిస్తూ ఓటు అడగాలన్నారు. ఈసారి కూడా పార్టీ అభ్యర్థిని గెలిపించి కేసీఆర్‌కు కానుకగా ఇస్తామన్నారు. పార్టీ రెండు సార్లు అవకాశం ఇచ్చిందని, ఇద్దరు నేతలు ఇతర పార్టీల నుంచి పోటీ చేస్తున్నారని ఆ ఇద్దరిని ఓడించటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే ప్రజల నుంచి వ్యతిరేకత ఎదుర్కొంటోందన్నారు. కేసీఆర్‌ను ప్రజలు ఇప్పుడు గుర్తు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మోహన్ గౌడ్, గ్రంథాలయ డైరెక్టర్ గణేష్ ముదిరాజ్, బీఆర్ఎస్ డివిజన్ల అధ్యక్షులు సంజీవరెడ్డి, రఘునాథ్‌రెడ్డి, ఎర్రగుడ్ల శ్రీనివాస్‌యాదవ్, గొట్టిముక్కల పెద్ద భాస్కర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

నియామకం

మూసాపేట: మూసాపేటకు చెందిన మోసిన్ ఖాన్‌ను కూకట్‌పల్లి అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ ఎన్నికల పరిశీలకుడిగా తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి ఫర్హాన ఆజ్మీ ఆదివారం నియమించారు. మోసిన్‌ఖాన్ మాట్లాడుతూ.. పార్టీ పదవితో తన బాధ్యత మరింత పెరిగిందన్నారు. మల్కాజిగిరి పార్లమెంట్‌లో కాంగ్రెస్ పార్టీని అధిక మెజార్టీతో గెలిపించడానికి కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించినందుకు ఇమ్రాన్ ప్రతాప్‌గర్హి, చైర్మన్ మైనార్టీ తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి ఫర్హాన ఆజ్మి, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

ఇరుకు రోడ్లతో ఇబ్బందులు

- రోడ్లను వెడల్పు చేయాలని కోరుతున్న ప్రజలు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



పాత మున్సిపల్ కార్యాలయం సర్కిల్ వద్ద పరిస్థితి

జిన్నారం(పటాన్‌చెరు): కాలనీల్లో ఏళ్ల కాలం నుంచి ఇరుకు రోడ్లు ఉన్నా వెడల్పు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవడంలేదు. జనాభా పెరుగుతున్నా అందుకు అనుగుణంగా రోడ్లను మాత్రం వెడల్పు చేయడం లేదని స్థానికులు, వాహనదారులు వాపోతున్నారు. జిన్నారం మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలో సుమారు 50వేల జనాభా ఉంటుంది. పారిశ్రామిక ప్రాంతం కావడంతో అన్ని వర్గాల ప్రజలు ఇక్కడ జీవనం సాగిస్తున్నారు. ఏటా జనాభా పెరుగుతూనే ఉంది. మున్సిపల్ పరిధిలో 22వార్డులు ఉన్నాయి. ప్రతి వార్డుల్లోని రోడ్లు ఇరుకుగానే ఉన్నాయి. వాహనాల రాకపోకల సంఖ్య ఎక్కువ ఉండడంతో నిత్యం ట్రాఫిక్ నిలిచిపోతోంది. దీంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాత మున్సిపల్ కార్యాలయ సర్కిల్‌లో నిత్యం ట్రాఫిక్ జాం అవుతుంటుంది. మియాపూర్, కూకట్‌పల్లి, సికింద్రాబాద్ నుంచి బొల్లారానికి నిత్యం వందల సంఖ్యలో ఆర్టీసీ బస్సులు తిరుగుతుంటాయి. దీనికి తోడు పారిశ్రామలకు వెళ్లే భారీ వాహనాలు కూడా ఇక్కడి నుంచే రాకపోకలు జరుపుతున్నాయి. సరిపడా రోడ్లు లేకపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. దీంతో ప్రమాదాలు కూడా తరచూ జరుగుతూనే ఉన్నాయి. తాజాగా కాలనీల్లో మిషన్‌భగీరథ పైప్‌లైన్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. రోడ్లకు రెండువైపులా పైప్‌లైన్ కోసం గుంతలు తీసి వదిలారు. రెండేళ్ల నుంచి ఈ పనులు జరుగుతూనే ఉన్నాయి. ఈ పనులను త్వరగా పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం

మున్సిపల్ పరిధిలోని ప్రధానరోడ్లలో ఉదయం, సాయంత్రం రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఆ సమయంలో ప్రత్యేకంగా సిబ్బందిని నియమించాం. రోడ్లను మరింత వెడల్పుచేస్తే ట్రాఫిక్ సమస్య కొంత మేర పరిష్కారం అవుతుంది.

– గంగాధర్, సీఐ బొల్లారం

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో... టమాట 25, పచ్చిమిర్చి 70, బెండ 50, కాకర 60, దొండ 40, దోస 30, ఆలు 40, చామ 60, కీర 30, బీర 50, వంకాయ 30, గోకర 50, బీన్స్ 70, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 70, క్యాబేజీ 30, క్యారెట్ 40, చిక్కుడు 70, ఉల్లి 25(కేజీ), ములక్కాయలు (2)10 , క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 20, అల్లం 150, వెల్లుల్లి 250.

సింక్రొనీకి 'బాక్స్ ఎంప్లాయిస్' అవార్డ్

సాక్షి, సిటీబ్యూరో: మాదాపూర్‌లోని ఫైనాన్షియల్ సర్వీసెస్ సంస్థ సింక్రోనీ.. యాంబిషన్ బాక్స్ ఎంప్లాయిస్ చాయిస్ అవార్డ్ అందుకుంది. మూడు అంశాలలో మెరుగైన పనితీరుతో టాప్ 20 మిడ్–సైజ్ కంపెనీలలో ఒకటిగా ఈ అవార్డు సాధించినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. కంపెనీల ప్రస్తుత, మాజీ ఉద్యోగుల రేటింగ్‌లు సమీక్షల ఆధారంగా యాంబిషన్ బాక్స్ ర్యాంక్స్ అందిస్తుందని, ఈ ఏడాది 50 వేలకుపైగా కంపెనీలు పోటీపడగా 14 లక్షలమంది ఈ ఓటింగ్‌లో పాల్గొన్నారని వివరించారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తా

కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్



కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్

మియాపూర్: మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ అన్నారు. మియాపూర్‌లోని శ్రీలా గార్డెన్ కాలనీలో ఆయన పర్యటించి కాలనీవాసులతో మాట్లాడుతూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ఫణికుమార్, చంద్రిక ప్రసాద్, కాలనీ వాసులు రాఘవరెడ్డి, ప్రవీణ్, శివ, కేశవప్రసాద్, జశ్వంత్, మధు తదితరులు పాల్గొన్నారు.

174 లీటర్ల మద్యం స్వాధీనం

ఇద్దరు నిందితుల అరెస్ట్





మద్యంతో పట్టుబడ్డ నిందితులు హన్మంతు, ప్రదీప్

గచ్చిబౌలి: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా అక్రమంగా తరలిస్తుండగా 174 లీటర్ల మద్యాన్ని మాదాపూర్ ఎస్ఓటీ పోలీసులు స్వాధీనం చేసుకొని గచ్చిబౌలి పోలీసులకు అప్పగించారు. గచ్చిబౌలిలోని కొండాపూర్ రోడ్డులో ఉన్న పాయిజన్ వైన్‌షాపులో అంజయ్యనగర్‌కు చెందిన సి.హన్మంతు(26), వైన్‌షాపు మేనేజర్ ఎ.ప్రదీప్(33)లు మద్యాన్ని బెల్టుషాపునకు తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న మాదాపూర్ ఎస్ఓటీ పోలీసులు శనివారం రాత్రి నిందితులిద్దరి నుంచి రూ.65 వేల విలువైన 239 క్వార్టర్ బాటిల్స్, 204 బీర్లు, 3 ఫుల్ బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి, కేసు దర్యాప్తు చేస్తున్నామని గచ్చిబౌలి ఎస్ఐ శోభన్ బాబు తెలిపారు.

చేవెళ్ల గడ్డపై బీజేపీ జెండా ఎగురవేయాలి

కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సోదరి అనితారెడ్డి

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని వివేకానందనగర్ పటేల్‌కుంట పార్కు సమీపంలో ఉన్న బీజేపీ ప్రాంతీయ కార్యాలయంలో ఆదివారం డివిజన్ స్థాయి నాయకుల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి వివేకానందనగర్, హఫీజ్‌పేట్ ప్రాంతాలకు సంబంధించిన అన్ని బూత్‌స్థాయి అధ్యక్షులు, ప్రముఖ్‌లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సోదరి అనితారెడ్డి హాజరై ప్రసంగించారు. బీజేపీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలన్నారు. చేవెళ్ల లోకసభ బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి విజయానికి సమన్వయంతో పనిచేయాలని సూచించారు. చేవెళ్ల గడ్డపై బీజేపీ జెండా ఎగురవేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మణిభూషణ్, అశోక్ నరేష్, శ్రీనివాస్, మామిడి సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామంతోనే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు


డాక్టర్ కృష్ణ చైతన్యరావు

కూకట్‌పల్లి: ప్రస్తుత కాలంలో ప్రతి ఒక్కరూ వ్యాయామం చేయటం వల్ల తమ ఆరోగ్యాలను కాపాడుకోవచ్చని డాక్టర్ కృష్ణ చైతన్యరావు అన్నారు. ఆదివారం వరల్డ్ హెల్త్ డే సందర్భంగా కూకట్‌పల్లిలోని మై హెల్త్ హాస్పిటల్ ఆధ్వర్యంలో 5కే మారథాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణలు పాల్గొని జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాక్స్ హెల్త్ హాస్పిటల్ డైరెక్టర్ కృష్ణచైతన్యరావు మాట్లాడుతూ... ప్రస్తుత రోజుల్లో ప్రతి మనిషి ఆరోగ్యపరంగా గుండె సమస్యలు కిడ్నీ సమస్యలు, మహిళలకు గైనకాలజీ సమస్యలతో బాధపడుతున్నారని పేర్కొన్నారు. వాటిని అరికట్టాలంటే ప్రతి ఒక్కరూ వ్యాయామాలు చేయాలన్నారు. 5కె రన్‌లో గెలిచిన డాక్టర్ కిరణ్, శ్రీనివాసులకు మెడల్ అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ స్నేహారెడ్డి, డాక్టర్ జయంత్‌రెడ్డి, డాక్టర్ ప్రేమ్‌కుమార్‌రెడ్డి, అన్వేష్ చౌదరి, భాస్కరరావు, శిరీష తదితరులు పాల్గొన్నారు.

నేడు అమావాస్య అన్నదాన వితరణ

మోతీనగర్: జై ఆర్యవైశ్య సేవా సమితి ఆధ్వర్యంలో అవావస్య అన్నదాన వితరణ సోమవారం మధ్యాహ్నం 12గంటలకు గాయత్రినగర్, గాంధీ బొమ్మ వద్ద నిర్వహించనున్నట్లు జై ఆర్యవైశ్య సేవా సమితి నాయకులు తెలిపారు. ఈ అన్నదానం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు.

మూగ జీవాలను ప్రేమించాలి



వీధి కుక్కలను దత్తత తీసుకున్న మణికొండ వాసులు

మణికొండ: మూగ జీవాలను ప్రేమించడంతో పాటు కొన్నింటిని దత్తత తీసుకుని వాటికి కొత్త జీవితాన్ని ఇవ్వాల్సిన అవసరం ఎంతో ఉందని జంతు ప్రేమికుడు నవీన్‌కుమార్ అన్నారు. మణికొండ మున్సిపాలిటీ , అలకాపూర్ టౌన్‌షిప్ నేతాజీపార్కులో మణికొండ యానిమల్ రెస్క్యూ గ్రూప్ (మార్గ్) ఆధ్వర్యంలో మూగ జీవాల దత్తత కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ సహకారంతో మూగ జీవాలకు అవసరమైన నీటి సౌకర్యం, వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ఆదివారం 12 వీధి కుక్కలను పలువురు దత్తత తీసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో మార్గ్ సభ్యులు పాల్గొన్నారు.